సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం, 7 అక్టోబర్ 2024



కూష్మాండాదేవిగా జోగుళాంబ

జోగుళాంబ అమ్మవారు ఆదివారం కూష్మాండాదేవి రూపంలో దర్శనమిచ్చారు.

వివరాలు 8లో ▸



వేగవంతంగా విద్యుదుత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జల కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0 /20.8

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ ప్రభావం ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

టీటీడీ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఐదు కేంద్రాల్లో గీతా జయంతిని పురస్కరించుకొని భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ జిల్లా కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఉత్తరాపల్లి రామాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమద్ భగవద్గీత 6వ అధ్యాయం (ఆత్మ సంయమున యోగ)పై పోటీలు ఉంటాయన్నారు. అలాగే 18 అధ్యాయాలు పూర్తిగా వచ్చిన వారికి కూడా పోటీలు నిర్వహిస్తామని, మొత్తం నాలుగు విభాగాల్లో భగవద్గీత **కంఠస్థ పోటీలు** ఉంటాయని చెప్పారు. 6, 7 **తరగతులు, 8, 9** తరగతులకు, 18 ఏళ్లలోపు, **18 ఏళ్లపైబడిన** వారికి సంపూర్ణ భగవద్గీత **700 శ్లోకాలపై** పోటీలు నిర్వహిస్తామన్నారు. **నవంబర్ 30న** వనపర్తిలోని శ్రీసరస్వతి శిశు**మందిరం ఉన్నత** పాఠశాల, డిసెంబర్ 1న **నారాయణపేట** జిల్లా మరికల్‌లోని శ్రీవాణి **హైస్కూల్, 4న** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి**లోని శ్రీవేంకటే**శ్వరస్వామి ఆలయం, **7న జోగుళాంబ** గద్వాల జిల్లాకేంద్రంలోని **శ్రీసరస్వతి టాలెం**ట్ హైస్కూల్, 10న మహబూ**బ్‌నగర్ జిల్లాకేం**ద్రంలోని టీటీడీ కల్యాణ మండపం**లో కంఠస్థ** పోటీలు ఉంటాయని చెప్పారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. విద్యార్థులు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో పాల్గొనాలని, పూర్తి వివరాల కోసం సెల్ నంబర్లు 93475 40005, 73967 11574లను సంప్రదించాలని సూచించారు.

హిందూ సమాజ జాగృతే.. ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం



జడ్చర్ల టౌన్: ఆర్‌ఎస్‌ఎస్ శత వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విజయదశమి మహోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పట్టణంలో పథసంచలన్ చేపట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ పతాకం ఎగురవేసి జీపుపై ఊరేగింపు జరపగా కరసేవకులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ పాలమూరు విభాగ్ సంచాలక్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. 99 ఏళ్లుగా హిందూ సంఘటనయే ధ్యేయంగా సమాజంలో దేశభక్తి, త్యాగనిరతిని ఆర్‌ఎస్‌ఎస్ పెంపొందిస్తుందన్నారు. భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు సంఘం నిరంతరం కృషిచేస్తుందన్నారు. విజయదశమి పర్వదినానికి శత వసంతంలోకి అడుగుపెడుతున్నందున ప్రతి కరసేవకుడు మరింత ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీరంగనాయక పరిరక్షణ కమిటీ కన్వీనర్ కాల్వ రాంరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రముఖ్ వసంత వెంకటేశ్, నగర కార్యావహ మరాఠి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తబస్టాండ్ కంపు.. కంపు

- జడ్చర్ల బస్టాండ్‌లో లోపించిన పారిశుధ్యం
- ఆరుబయటే మూత్ర విసర్జన
- తినుబండారాలపై ఈగలు, దోమలు
- తిష్టవేసిన సమస్యలు.. పట్టించుకోని అధికారులు - జడ్చర్ల

వివరాలు 8లో ▸



ఆపత్కాలంలో అండగా..

జిల్లాలో 'డయల్ 100'కు పెరిగిన అభ్యర్థనలు

- ప్రతిరోజు 130 నుంచి 150 ఫోన్ కాల్స్
- తక్షణమే స్పందిస్తున్న పోలీస్ యంత్రాంగం
- ఈ ఏడాది పది నెలల్లోనే 29,329 ఫిర్యాదులు
- సమాచారం గోప్యత, సాక్ష్యం చెప్పడంలో వెసులుబాటు కల్పిస్తున్న పోలీసులు

మహమ్మదాబాద్‌లో ఓ ఏటీఎంను దొంగలు వెనుక భాగంలో కట్టర్ సహాయంతో తొలగించి చోరీ చేయడానికి ప్రయత్నించారు. వెంటనే ముంబాయిలో ఉన్న ప్రధాన బ్యాంకుకు అలర్ట్ ఇవ్వడంతో వారు డయల్ 100కు సమాచారం అందించారు. వెంటనే సదరు పోలీస్‌స్టేషన్ బ్లూకోర్ట్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకోవడంతో చోరీ ప్రయత్నం విరమించుకున్నారు.

మహబూబ్‌నగర్ క్రైం: ఆపదకాలంలో ఆపన్నహస్తంగా పోలీసుల డయల్ 100 బాధితులకు భరోసానిస్తోంది. మొదట జిల్లాలో ఏ ప్రాంతం నుంచి డయల్ 100కు కాల్ చేసినా హైదరాబాద్‌లో ఉండే కమాండ్ కంట్రోల్ రూంకు వెళ్తుంది. అక్కడి నుంచి సదరు పోలీస్‌స్టేషన్ వెళ్లడం అడ్రస్ ఇబ్బంది ఉంటే స్థానికంగా ఉన్న ఎస్పీ కార్యాలయంలో పరిధిలో ఉండే సిబ్బంది సమాచారం వెళ్తుంది. ఎస్పీ కార్యాలయంలో డయల్ 100 పర్యవేక్షణకు ఒక ప్రత్యేక కంట్రోల్ రూం ఉంటుంది. ఇందులో ఒక సీఐ స్థాయి అధికారి లేదా ఎస్‌ఐ అధికారితోపాటు నలుగురు కానిస్టేబుళ్లు మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వహిస్తూ ఫోన్ కాల్స్‌ను పర్యవేక్షించడంతోపాటు బ్లూకోర్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేస్తారు.

ఎలా పని చేస్తుందంటే..

ఆపదలో ఉన్న వారు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై డయల్ 100కు ఫోన్ చేస్తే వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. సమాచారం అందుకున్న సిబ్బంది ఆ తర్వాత సదరు పోలీస్‌స్టేషన్ సిబ్బందికి చేరవేస్తారు. ఇక పట్టణ ప్రాంతాలైతే 10 నిమిషాల్లో, మారుమూల గ్రామీణ ప్రాంతాలైతే అరగంటలో చేరుకోవాలి. వెంటనే ట్యాబ్‌లో ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసి, ప్రాథమిక సమాచారం కంట్రోల్ రూంకు పంపిస్తూనే తగిన సహాయక చర్యలు చేపట్టాలి.

నిమిషాల వ్యవధిలోనే స్పాట్‌కు..



డయల్ 100కు వచ్చిన కాల్స్ మొదట హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ రూంకి వెళ్లి అక్కడి నుంచి సదరు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, లేదా బ్లూకోర్ట్స్ ట్యాబ్‌లకు వెళ్తుంది. ప్రతి స్టేషన్‌కు మూడు నుంచి నాలుగు బ్లూకోర్ట్స్ టీంలు ఉన్నాయి. ప్రతి టీం దగ్గర ట్యాబ్‌లు ఉన్నాయి. ఫోన్‌కాల్ వచ్చిన 5 – 10 నిమిషాల వ్యవధిలో బ్లూకోర్ట్స్ సిబ్బంది స్పాట్‌కు వెళ్తారు. దీంట్లో కొన్ని కేసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తాం. కొన్నింటిని అక్కడే కౌన్సెలింగ్ ఇచ్చి పరిష్కరిస్తాం. ఇటీవల డయల్ 100 కాల్స్ బాగా పెరిగాయి.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ, మహబూబ్‌నగర్

ఒక్కో సమయంలో ఇలా..

డయల్ 100కు సాధారణంగా జిల్లాలో ప్రతిరోజు 130 **నుంచి 150 ఫోన్** కాల్స్ వస్తున్నాయి. ఇందులో ప్రధానంగా **రాత్రి 9 గంటల** నుంచి మద్యం మత్తులో తాగుబో**తుల ఆగడాలు,** రహదారులపై వాగ్వాదాలు, కాలనీల్లో **గొడవలు, రౌడీ** షీటర్ల అరాచకాలపై వస్తుంటాయి. **రాత్రి 11 గంటల** ప్రాంతాల్లో భార్యాభర్తల మధ్య **గొడవలు, గొడవల**తో ఇంటి నుంచి బయటకు గెంటేసి**న.. మద్యం తాగి** ఇంట్లో, చుట్టు పక్కల వారిపై భౌతిక **దాడులకు పాల్పడ**టం, హత్యాయత్నానికి పాల్పడు**తామని బెదిరింపు**లు చేయడం వంటి కాల్స్ వస్తున్నాయి. **అర్ధరాత్రి** నుంచి తెల్లవారుజాము వరకు తాళం **వేసి ఉన్న ఇళ్లలో** చోరీలు, రహదారి ప్రమాదాలపై అధికంగా వస్తుంటాయి.

❐ మహిళల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో కళాశాల, ఇతర ప్రైవేట్ ఉద్యోగాలు చేసే మహిళలు ఆకతాయిల వేధింపులు, ఫోన్‌లో అసభ్య చాటింగ్, ర్యాగింగ్, తాగుబోతుల అరాచకాలు, భర్తల వేధింపులు, ఆత్మహత్యాయత్నాలు, గృహహింస సమస్యలపై కాల్స్ వస్తున్నాయి.

పది నెలల వ్యవధిలోనే..



డయల్ 100కు జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 29,329 ఫిర్యాదులు రాగా.. గతేడాది 34,312 ఫిర్యాదులు వచ్చాయి. ఆపదలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై 100కు ఫిర్యాదు చేయవచ్చు. ఫోన్ చేస్తే సాక్ష్యం చెపాల్సి వస్తుందనే భయం కూడా అవసరం లేదు. డయల్ 100కు ఫోన్ చేస్తే సాక్ష్యం చెప్పాల్సిన పనిలేదని అధికారులు చెబుతున్నారు. వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని సూచిస్తున్నారు. మరో రెండు నెలలు ఉండటంతో మరిన్ని ఫిర్యాదులు పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

ధరల 'మంట'

పండగ వేళ భారీగా పెరిగిన నిత్యావసరాల రేట్లు



- వంటనూనెలు, బియ్యం తదితరవి పెరగడంతో సామాన్యులపై భారం
- పూలు, ఉల్లి, టమాటలకు రెక్కలు
- అదే బాటలో పప్పుదినుసులు సైతం
- నియంత్రణ చర్యలు చేపట్టని ప్రభుత్వ యంత్రాంగం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఒకపక్క బతుకమ్మ సంబరాలు.. మరోపక్క దసరా పండగ వేళ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పండగకు పక్షం రోజుల ముందు నుంచే దుకాణాలకు వెళ్తున్న సామాన్యులకు సరుకుల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఒక్కసారిగా పెరిగిన ధరలతో పేదలు, సామాన్యులపై పెనుభారం పడుతోంది. దేవునికి దీపం వెలిగించే నువ్వుల నూనె మొదలుకొని.. వంట నూనెల వరకు కనీసంగా రూ.20 నుంచి 45 వరకు పెరిగాయి. అన్ని రకాల వంట నూనెల ధరలు పాకెట్‌కు రూ.30 చొప్పున పెంచడంతో పిండివంటలకు సిద్ధమవుతున్న గృహిణులకు షాక్ తగులుతోంది. నిత్యావసరాలైన బియ్యం దగ్గరి నుంచి నూనె, పప్పులు, ఉల్లిగడ్డలు, వెల్లుల్లి, కూరగాయల ధరలు అమాంతం పెరగడంతో పేదలు, సామాన్యులకు పండగ జరుపుకోవడం కొండంత కష్టంగా మారింది. బ్లాక్ దందాలు, ధరల పెరుగుదలను నియంత్రించాల్సిన ప్రభుత్వం, సంబంధిత అధికారులు గాలికి వదిలేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉల్లి, టమాట ధరలకు రెక్కలు..

వానాకాలం నేపథ్యంలో వరదలు సంభవించి పంటలు నష్టపోవడంతో కూరగాయలు, ఉల్లి, వెల్లుల్లి, అల్లం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో వెల్లుల్లి ధర రూ.350, ఉల్లి ధర రూ.60 వరకు పలుకుతోంది. కందిపప్పు, పెసర, మినములు, శనగ తదితర అన్ని పప్పుదినుసుల ధరలు పెరిగాయి. కందిపప్పు కిలో రూ.150 నుంచి రూ.180కి, పెసర పప్పు కిలో రూ.130 నుంచి 150కి, శనగ పప్పు కిలో రూ.85 నుంచి 110 వరకు విక్రయిస్తున్నారు. కిలో టమాట ధర రూ.30 నుంచి 60కి చేరుకుంది. ధరల నియంత్రణపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన మార్కెటింగ్, పౌరసరఫరా శాఖలు అసలు ఆ పనినే పట్టించుకోవడం లేదు. కేవలం రైస్ మిల్లర్లు, సీఎమ్మార్ బియ్యం పర్యవేక్షణకే ఆయా శాఖలు పరిమితం కావడం తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అడ్డగోలుగా పెంపు..

పండగ వేళ వ్యాపారులు అడ్డగోలుగా ధరలు పెంచేస్తున్నారు. సన్‌ఫ్లవర్ నూనె పాకెట్ రూ.105 నుంచి రూ.130కి చేరింది. నువ్వులు, వేరుశనగ నూనెల రూ.30 చొప్పున పెరిగాయి. వారం రోజుల్లో ఈ ధరలు మరింత పెరగనున్నాయని చెబుతున్నారు. నిత్యం వినియోగించే బియ్యం ధరలు దాదాపు రెట్టింపు స్థాయికి చేరుకున్నాయి. సన్న బియ్యం మరింత ప్రియంగా మారుతోంది. జైశ్రీరాం, సోనామసూరి తదితర రకాల సన్నబియ్యాన్ని మార్కెట్‌లో కిలో రూ.70 వరకు విక్రయిస్తున్నారు. గత సీజన్‌లో బియ్యం క్వింటాల్‌కు రూ.3 వేలలోపే కొనుగోలు చేసిన వ్యాపారులు, పండగ సమయానికి బియ్యం ధరలను రెట్టింపు చేసి విక్రయిస్తున్నారు.

పూల ధరలు సైతం..

బతుకమ్మ అంటేనే పూల పండుగ. ఇదే అదునుగా పూల ధరలు సైతం భారీగా పెరిగాయి. గత నెల చివరి వరకు కిలో రూ.వందలోపు పలికిన బంతిపూలు ఇప్పుడు ఏకంగా రూ.150 నుంచి రూ.180 వరకు విక్రయిస్తున్నారు. అలాగే చామంతి, ఇతరత్రా పూలు రూ.20కి 50 గ్రాములు ఇస్తుండగా.. ఇప్పుడు రూ.50 తక్కువ ఇవ్వడం లేదు.

పండగల సమయంలోనే..



ప్రతిసారి పండగల సమయంలో ధరలు పెరగడం పరిపాటిగా మారింది. దసరా అనేది మనకు పెద్ద పండగ. ఇలాంటి సమయంలో నూనెలు, పప్పులు, బియ్యం ధరలు పెరగడం కొంత ఇబ్బంది కలిగిస్తోంది. ప్రభుత్వం ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి. వీటితోపాటు కూరగాయల ధరలు కూడా పెరిగాయి.

– అరుణ, గృహిణి, కావేరమ్మపేట, జడ్చర్ల

ఏం కొనేటట్టు లేదు



పెరుగుతున్న ధరలతో ఏం కొనేటట్టు లేదు. పండగెట్ల చేసుకోవాలి. అసలు పండగలప్పుడే ధరలు ఎందుకు పెరుగుతాయో అర్థం కావడం లేదు. వారం కిందటి వరకు ఉన్న నూనెల ధరలు రూ.30–40 వరకు పెరిగాయి. సన్నబియ్యం అయితే కిలో రూ.60కి చేరింది. ఇంకెంత పెరుగుతాయో తెలియదు.

– కె.రంజిత, గృహిణి, గంగాపురం, జడ్చర్ల మండలం

పాలమూరు మీదుగా సికింద్రాబాద్- వాస్కోడగామా



మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో స్వాగతం పలుకుతున్న ప్రయాణికులు

- ఉమ్మడి జిల్లాలోని నాలుగు స్టేషన్లలో ఆగనున్న రైలు
- స్వాగతం పలికిన ప్రయాణికులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సికింద్రాబాద్- వాస్కోడగామా (గోవా) మధ్య కొత్తగా ప్రవేశపెట్టిన బైవీక్లి ఎక్స్‌ప్రెస్ రైలు ఉమ్మడి జిల్లా మీదుగా వెళ్లనుంది. ఆదివారం సికింద్రాబాద్ స్టేషన్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభోత్సవ ప్రత్యేక ఈ రైలును ప్రారంభించారు. కర్ణాటక, గోవా వైపు ప్రయాణించే వారికి ప్రత్యక్ష రైలు సౌకర్యాన్ని అందిస్తుంది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ బైవీక్లి రైలు సికింద్రాబాద్ నుంచి ప్రతి బుధ, శుక్రవారాల్లో, వాస్కోడిగామా నుంచి ప్రతి గురు, శనివారాల్లో రాకపోకలు సాగించనుంది. ఈ కొత్త రైలు దాదాపు 854 కిలోమీటర్ల దూరాన్ని ప్రయాణ సమయంలో దాదాపు 20 గంటలపాటు ఎగువ దిశలో.. తిరుగు దిశలో 21 గంటలపాటు ప్రయాణిస్తుంది. ఈ రైలు ప్రయాణికులకు సౌకర్యవంతమైన అనుభూతి, ఆధునిక సౌకర్యాలు అందిస్తుంది. ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్న సికింద్రాబాద్- గోవా బైవీక్లి (17039/17040) ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి.. కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల తదితర స్టేషన్ల మీదుగా మరుసటి రోజు తెల్లవారుజామున 4.20 గంటలకు వాస్కోడగామాకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 10న ఉదయం 9 గంటలకు వాస్కోడగామా నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అయితే మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు చేరిన సికింద్రాబాద్- వాస్కోడగామా రైలుకు పలువురు ప్రయాణికులు ఘనంగా స్వాగతం పలికారు. రైలుపై పూలు చల్లడంతోపాటు స్వీట్లు పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామిక గొంతులను నొక్కేందుకు కుట్ర



మహబూబ్‌నగర్ న్యూటౌన్: భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో లౌకిక వ్యవస్థ ప్రమాదంలో ఉందని అలీఘడ్ యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ మధిహురుల్ రెహమాన్ షేర్వానీ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆలిండియా తంజీమే ఇన్సాఫ్ జాతీయ సమితి సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధ, జైన తదితర వర్గాల ప్రజలను సెకండ్ సిటిజన్లుగా చేసే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారత రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులను కాలరాస్తూ దేశ సమగ్రతను ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రజాస్వామిక గొంతులను నొక్కుతూ ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షులు సయ్యద్ అజీజ్‌పాష, ప్రధాన కార్యదర్శి అయూబ్ అలీఖాన్, ఇర్ఫాన్ ఆలం, ఇస్లాముద్దీన్, రహమాన్, నవాబ్‌పాష, రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేశ్వర్‌గౌడ్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రుల పర్యటన

నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి నియోజకవర్గంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అచ్చంపేట నియోజకవర్గంలో అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం పర్యటించనున్నారు. మంత్రుల పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం తెలిపారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి



బాస్కెట్‌బాల్ మహిళా జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్ అడ్వకేట్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా మహిళా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాకీర్ అడ్వకేట్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ సమష్టిగా ఆడితే విజయం సాధించవచ్చన్నారు. జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో సోమ, మంగళవారాల్లో రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి నస్రుల్లా హైదర్, కార్యనిర్వాహక కార్యదర్శి మీర్ ఖాలెద్‌అలీ, సంయుక్త కార్యదర్శి మహ్మద్ ఇలియాజ్, సభ్యులు ఫారుఖ్ ముకర్రం, కోచ్ ఎండీ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జట్టు సభ్యులు..

కె.జ్యోతి, కె.ప్రియాంక, పి.అర్పిత, టి.సిరివల్లిక, జి.భువనేశ్వరి, కె.సాయినిఖిత, ఎస్.హర్షిత, జి.చైత్ర, ఎం.శ్రీలత, కె.హరిణి, మేఘన, జి.వైష్ణవి, కోచ్ మహ్మద్ ఇలియాజ్, మేనేజర్ మహ్మద్ అఫ్రోజ్ వ్యవహరిస్తారు.

జోగుళాంబ ఆలయ అభివృద్ధికి కృషి

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సతీమణి ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ ఈఓ

జోగుళాంబ శక్తిపీఠం/ అలంపూర్ రూరల్: రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠమైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర పురాతత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతామని.. అభివృద్ధికి తనవంతు సహకరిస్తానని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం మంత్రి, ఆయన సతీమణి ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌తో కలిసి జోగుళాంబ ఆలయాన్ని దర్శించుకున్నారు. ముందుగా వారికి దేవస్థానం ఈఓ పురేందర్‌కుమార్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. విఘ్నేశ్వరుడు, బాలబ్రహ్మేశ్వరుడు, జోగుళాంబ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, యాగశాలలో నవచండీహోమం చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం టూరిజం హోటల్‌లో మంత్రి ఆలయ అధికారులతో అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై ఆరా తీశారు. ప్రముఖ ఆర్కిటెక్చర్ రామకృష్ణతో మాట్లాడి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అలంపూర్‌లో నిర్మించిన ప్రసాద్ స్కీం భవనం కూడా త్వరగా పూర్తి చేసి అక్కడ అన్నదాన సత్రం నిర్వహించేందుకు టూరిజం ఎండీతో మాట్లాడతానని చెప్పారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో మాట్లాడి అలంపూర్ ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించేలా చూస్తానని, త్వరలోనే రివ్యూ ఏర్పాటు చేస్తామన్నారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వారికి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించగా ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వారి వెంట ఎంపీ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, గద్వాల జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత తదితరులున్నారు.

60 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో నిరుద్యోగులను మోసం చేస్తే.. తాము జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఎంతో మేలు చేకూర్చామన్నారు. గ్రూప్- 1, 2, 3లకు సంబంధించి ఉద్యోగ కల్పనపై ఎప్పటికప్పుడు తెలిసేలా జాబ్ క్యాలెండర్ ఉపయోగపడుతుందన్నారు. డీఎస్సీ పరీక్షలు నిర్వహించి వందరోజుల్లో ఫలితాలు ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ద్వారా 10 వేల మంది నిరుద్యోలను ఉద్యోగులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తుందన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హన్వాడ మండలం ఇబ్రహీంబాద్‌కు చెందిన మత్స్యకారులు అక్కడి హేమసముద్రంలో ఈ నెల 7న చేపలు విడిచే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఎమ్మెల్యేను ఆదివారం క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది మత్స్యకారులు ఎక్కడికక్కడ చెరువులనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వాటిని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 3, 4 వార్డుల మధ్యలోనున్న పవనపుత్ర కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే అక్కడి అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కౌన్సిలర్ రామాంజనేయులు, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, శివశంకర్, హన్మంతు, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, సభ్యులు ఎర్ర వెంకటయ్య, వన్నాడ అంజిలయ్య, పి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



ఎర్రవల్లి: ప్రమాదవశాత్తు కారు టైరు పేలి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన 44వ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి తన కారులో హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో 44వ జాతీయ రహదారిపై బీచుపల్లి వద్ద ఆయిల్ మిల్లు సమీపంలోకి రాగానే ఒక్కసారిగా కారు టైరు పేలింది. దీంతో కారు కాస్తా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఘటనలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బొలెరో ఢీకొని..

నర్వ: రోడ్డు ప్రమాదంలో అతివేగంగా వచ్చిన బొలేరో ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ కురుమయ్య కథనం ప్రకారం.. లంకాల్‌కి చెందిన దుప్పల్లి శ్రీనువాసులు శనివారం బైక్‌పై మహబూబ్‌నగర్‌కు హాస్పిటల్ పనిపై తన కుమారుడు రాముతో కలిసి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో రాంపూర్ గేట్ దాటి లంకాల్ చెరువు కట్ట మలుపు వరకు రాగా ఎదురుగా అతి వేగంగా వస్తున్న పటాన్ చెరువు సంగారెడ్డికి చెందిన బొలేరో వాహనం ఢీ కొంది. ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు తండ్రి కొడుకులు కిందపడ్డారు. ప్రమాదంలో రాము కుడిచేయికి రక్తగాయాలు అయ్యాయి. కాగా తండ్రి శ్రీనువాసులు తలకు గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్‌కు తరలించగా సాయంత్రం అక్కడ ఆయన మృతిచెందాడు. ఆయన పెద్ద కుమారుడు దుప్పల్లి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

జడ్చర్లలో..

జడ్చర్ల: పట్టణంలోని ఫ్లై ఓవర్‌పై శనివారం అర్ధరాత్రి తరువాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉందని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఛత్తీస్‌ఘడ్‌లోని గరియాబ్ జిల్లా నవాపరకు చెందిన ముర్హ (54), కల్లు రాము ఉపాధి నిమిత్తం జడ్చర్లకు వచ్చి సమీపంలోని ఇటుక బట్టీల్లో పని చేసేవారు. శనివారం అర్ధరాత్రి సమయంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జిపై నడుచుకుంటూ తాము ఉంటున్న గది వైపు వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ముర్హ అక్కడికక్కడే మృతిచెందగా.. కల్లు రాముకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి అటునుంచి హైదరాబాద్‌కు తరలించారు. ముర్హ కుమారుడు రాంనారాయణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి) : మండలంలోని నల్కర్‌పేట గ్రామానికి చెందిన ఊడుతనూరు మేగస్వామి (22) అనే యువకుడు కేఎల్ఐ కాల్వలో ఈతకు వెళ్లి గల్లంతయిన ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం మేగస్వామి పొలం పనులకు వెళ్లాడు. ఈత కొట్టడం కోసం అని పక్కనే ఉన్న కేఎల్ఐ కాల్వలోకి దిగాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో అతడు కొట్టుకుపోయాడు. అదే సమయంలో విషయం గమనించి తిరుపతయ్య అనే వ్యక్తి చీరలు వేసి రక్షించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. చూస్తుండగానే ఆ యువకుడు కనిపించకుండా పోయాడు. ఆదివారం రాత్రి వరకు గ్రామస్తులు యువకుడి కోసం గాలించినా ఫలితం లేకపోయింది.

'ఆరోగ్యమిత్ర' ఆత్మహత్యాయత్నం

మహబూబ్‌నగర్ క్రైం: భూమి విషయంలో తెలిసిన బంధువు మోసం చేయడం.. మరో వ్యక్తి డబ్బుల డిమాండ్‌తో తీవ్ర మనస్థాపానికి గురైన ఓ ఆరోగ్యమిత్ర ఆత్మహత్యకు యత్నించాడు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన వై ప్రదీప్‌కుమార్ ఆరోగ్యశ్రీ విభాగంలో ఆరోగ్యమిత్రగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల అతడి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూమి వ్యవహారంలో తెలిసిన బంధువు మోసం చేయడంతో పాటు పట్టణానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తూ లీగల్ నోటీసులు పంపాడు. దీంతో తన కుటుంబానికి రావాల్సిన భూమి రాకపోవడంతో పాటు కోర్టుల చుట్టు తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని తీవ్ర మనస్థాపానికి గురైన ప్రదీప్‌కుమార్.. ఆదివారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ వెల్లడించారు.

కొత్తబస్టాండ్ కంపు..కంపు



బస్టాండ్ ఆవరణలో పేరుకు పోయిన చెత్త



మూతబడిన మూత్రశాల

- జడ్చర్లలో లోపించిన పారిశుద్ధ్యం
- ఆరుబయటే మూత్ర విసర్జన
- తినుబండారాలపై ఈగలు, దోమలు
- తిష్టవేసిన సమస్యలు, పట్టించుకోని అధికారులు

జడ్చర్ల: హైదరాబాద్ నుంచి కర్నూల్ తదితర ప్రాంతాలకు 44వ నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి ఒక్కసారిగా భరించలేనంత కంపు వాసన రావడంతో జడ్చర్లకు వచ్చేశామన్న సంకేతం వస్తుందంటే జడ్చర్ల కొత్త బస్టాండ్ దుర్గంధం ఎంతగా పరిమళిస్తుందో ఊహించవచ్చు. ఓ వైపు 44వ నంబర్ జాతీయ రహదారి మరో వైపు 167వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న జడ్చర్ల కొత్త బస్టాండ్ మీదుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలు, కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, తదితర ప్రాంతాలకు నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ దారి గుండా వీఐపీలు, వీవీఐపీలు సైతం వస్తూపోతూ ఉంటారు. ఇంత ముఖ్యమైన ఈ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు ఎంతమాత్రం లేవంటే అతిశయోక్తి కాదు.

కానరాని పారిశుద్ధ్యం

జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో ఎక్కడా పారిశుద్ధ్యం కానరాదు. బస్టాండ్ పరిసరాలలో చెత్త చెదారం నిల్వలు పేరుకుపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. బస్టాండ్ ఖాళీ ప్రదేశాల్లో వ్యాపార సముదాయాల వారు చెత్తను పారబోస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, తదితర చెత్త ఎక్కిడికక్కడ పడేస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

పచ్చదనం జాడేదీ..

ప్రభుత్వం హరితహారం, హరిత వనం వంటి కార్యక్రమాలు చేపట్టినా, బస్టాండ్‌లో మాత్రం ఆ పచ్చదనం మచ్చుకైనా కానరాదు. బస్టాండ్‌లో ఎక్కడ పూలమొక్కలు, తదితర అహ్లాదకరమైన పరిస్థితులు కానరావు. పూలతొట్లు, పూల మొక్కలతో అందమైన గార్డెన్‌తో అలరారే వాతావరణం ఉట్టిపడేలా ఆర్టీసీ అధికారులు కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి..

బస్టాండ్ ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రయాణికులు సంబంధిత ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎక్కడికక్కడ డస్ట్‌బీన్‌లు ఏర్పాటు చేయడం, గుట్కా,పాన్ మరకలు లేకుండా జాగ్రత్తలు తీసుకునేలా పర్యవేక్షించాలి. బస్టాండ్‌లోని ప్లాట్ ఫామ్‌లకు అనుగుణంగా ప్రయాణికులకు అందుబాటులో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. బహిరంగ ప్రదేశాలలో మూత్ర విసర్జన చేయకుండా హెచ్చరించేలా చర్యలు చేపట్టాలి. చుట్టు దుకాణ సముదాయాలు, హోటళ్లు, తదితర వారు చెత్తాచెదారం వేయకుండా చూడాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యల పరిష్కరించి జడ్చర్ల కొత్త బస్టాండ్‌ను ఓ మోడల్‌గా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే ..

జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో కొద్ది సేపు బస్సుల కోసం వేచి చూడాలంటేనే ప్రయాణికులు దడుసుకుంటున్నారు. ఎక్కడ నిలబడినా కంపు వాసన రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయటే మూత్ర విసర్జన చేస్తుండడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రైవేట్ సులబ్ కాంప్లెక్స్ నిర్మించి మరుగుదొడ్లు ఏర్పాటు చేసినా అవి ప్రయాణికులందరికి అందుబాటులో లేవు. సులబ్ కాంప్లెక్స్ నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉంది. వినియోగదారుల నుంచి రుసుం వసూలు చేస్తున్నా సులబ్ కాంప్లెక్స్ సైతం కంపు కొడుతోంది. ఇక్కడ పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. ముక్కు మూసుకుని మరుగుదొడ్లను వినియోగించుకునే పరిస్థితి ఉంది. బస్టాండ్ నలుదిక్కులు ముక్కుపుటాలదిరే కంపును వెదజల్లుతుండడంతో ప్రయాణికులు ముక్కులు మూసుకుని కంపు భరిస్తున్నారు. ఆవరణలో మూత్రాలు కాలువలా పారుతున్నాయి. ఇక వాటిపై వాలిన ఈగలు, దోమలు బస్టాండ్‌లోని తినుబండారాల స్వైర విహారం చేస్తున్నాయి. చిరుతిళ్లు తిన్నవారు అనారోగ్యం బారిన పడుతున్నారు.

బహిరంగ మూత్ర విసర్జనతో దుర్వాసన



బస్టాండ్ ఆవరణలో మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా బహిరంగ ప్రదేశాలలో మూత్ర విసర్జన చేస్తున్నారు. ఆటోలు నిలిపే స్థలంలో కూడా ఆరుబయటే మూత్ర విసర్జన చేస్తున్నారు. ఎన్నో సార్లు వారించినా ఎదురు తిరిగి చివాట్లు పెడుతున్నారు. దీంతో బస్టాండ్ ఆవరణమంతా కంపు కొడుతోంది. సొంత డబ్బులతో మట్టి పోయించి పారిశుద్ధ్య పనులు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. బహిరంగంగా మూత్ర విసర్జన చేయుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మాధవరెడ్డి, ఆటో డ్రైవర్, జడ్చర్ల

కొన్ని పాములు మాత్రమే విషపూరితమైనవి

మన్ననూర్: ఐదు రకాల పాములు మాత్రమే విషపూరితమైనవని.. మిగతా పాములతో ఎలాంటి హాని ఉండదని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన స్నేక్ క్యాచర్, అసోసియేట్ ప్రొఫెసర్ సదాశివయ్య అన్నారు. ఆదివారం మన్ననూర్‌లోని అటవీశాఖ వనమాలికా ప్రాంగణంలో పాములపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోబ్రా, కట్లపాము, పైథాన్, నీరుకట్టె, వానపాము, జెర్రిపోతు, పూడుపాము, టింకెట్ వంటి 8 రకాలైన పాములను చూపించడంతో పాటు వాటి లక్షణాలను వివరించారు. పాములకు హాని తలపెట్టనంత వరకు ఎవరిపై దాడి చేయవన్న విషయాన్ని గమనించాలని ప్రత్యక్షంగా చూయించారు.



పాములపై అవగాహన కల్పిస్తున్న సదాశివయ్య

కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ దేవజ, ఎడ్యుకేషనల్ అధికారిణి శ్వేత, బయాలజిస్టు మహేందర్, ఎఫ్ఎస్ఓలు బాబలి, శ్రీకాంత్, స్నేక్ క్యాచర్ టీం రాహుల్, రవీందర్, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నారాయణపేట: అబాంగాపూర్‌లో ఆదివారం టాస్క్ ఫోర్స్, రూరల్ పోలీసులు దాడులు నిర్వహించి 16.30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. వాటిని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ రాముడు తెలిపారు. గ్రామానికి చెందిన శివలీల అనే మహిళకు చెందిన కిరాణా షాప్ లో 14 క్వింటాళ్ల పీడీఎస్ రైస్, అదే గ్రామానికి చెందిన శెట్టి శేఖర్ ఇంట్లో 2.30 క్వింటాళ్ల రైస్ అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. డీటీ పంచనామానంతరం కేసు నమోదు చేశారు.

కోడేరు పరిధిలో..

కోడేరు: మండల కేంద్రానికి చెందిన మానపాడు రమేష్ 5 క్వింటాళ్ల 50 కిలోల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ గోకారి పట్టుకున్నారు. ఈమేరకు ఆటోను పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయంలో హుండీ చోరీ



హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

అయిజ: మండల కేంద్రంలోని తిక్కవీరేశ్వర స్వామి ఆలయంలో హుండీని చోరీ చేశారు. ఎస్ఐ విజయ భాస్కర్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి ఆలయం గేటుకు వేసిన తాళం విరగొట్టారు. ఆలయంలోకి ప్రవేశించి హుండీ తాళం విరగ్గొట్టారు. అందులోని సుమారు రూ. 14 వేలు అపహరించారు. ఆదివారం ఉదయం విషయం గుర్తించిన ఆలయ అర్చకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

సాగునేలకు బలం భాస్వరం



వరిపంట



మొక్కజొన్న పంట

అలంపూర్: భూమికి భాస్వరం ముఖ్యమైన పోషకం. ప్రకృతి సిద్ధంగా లభించే గాలి, నీరులాగే మొక్కకు కావాల్సిన 16 రకాల పోషకాలు సాగు భూమి ద్వారా లభ్యమవుతాయి. వీటిలో నత్రజని, భాస్వరం పోషకాలు తక్కువ పరిమాణంలో, పొటాష్ పోషకం ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. ఈ పోషకాలు ఇసుక భూములు, మధ్యస్త నేలలు, ఎర్రగరప నేలలు, నల్లరేగడి భూముల్లో తక్కువ శాతం ఉండే అవకాశాలున్నాయి. పోషక పదార్థాల లభ్యత నేల రకాన్ని బట్టి నేల భౌతిక స్థితి, రసాయన లక్షణాలు, సూక్ష్మ జీవుల చర్య, వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. భాస్వరం ప్రాముఖ్యతను ఈ విధంగా వివరించారు. ప్రాముఖ్యం:

- భాస్వరాన్ని లవణాల రూపంలో మొక్కలు తీసుకుంటాయి.
- పూలు, విత్తనాలు, దుంపలు తదితర ఆర్థిక ప్రాముఖ్యత గల పంటల్లో విత్తనపు భాగాల్లో ఈ పోషకం అవసరం ఎక్కువే.
- భూమిలో సేంద్రియ ఎరువులు బాగ కుళ్లటకు దోహదపడుతుంది.
- పంట త్వరగా పక్వానికి రావడానికి ఉపయోగపడుతుంది.
- కణ విభజన, పైరు అభివృద్ధి మొక్క తొందరగా నిలదొక్కుకోవడం, మొక్కలో మాంసకృతులు, ఎంజైముల తయారీకి ఉపయోగపడుతుంది.
- భాస్వరం తగినంత ఉంటే నత్రజని ఎక్కువైన పైర్లకు కలిగే దుష్పలితాలను కొంత మేరకు అరికడుతుంది.
- మొక్కలకు అవసరమైన పిండి పదర్థాం తయారు చేసుకోనే కిరణజన్య సంయోగక క్రియలో కీలకపాత్ర వహిస్తోంది.
- మొక్కల ఉచ్వాస, నిశ్వాలకు నైట్రోజన్ వాడకం, ఎంజైములు ఉత్పత్తిలోను పాస్పరస్ అవసరం. ఈ మూలకం లోపిస్తే మొక్కల వేర్ల పెరుగుదల బలహీనమవుతాయి.
- పైరులో పెరుగుదలతో పాటు పిలకలు పెట్టే శక్తి క్షీణిస్తుంది.
- పైరు పూతకు రావడం ఆలస్యమై దిగుబడులు ఘననీయంగా తగ్గుతాయి.
- భాస్వరం లోపించిన పత్ర హరితం(క్లోరోఫిల్) ఏర్పడకపోవడం వల్ల ముదురు ఆకుపచ్చ రంగులో ఆకులు కనబడతాయి.
- మొక్కలు వాతావరణం నుంచి బొగ్గుపులుసు వాయువును తీసుకోని వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.
- మొక్కలు వాటి తొలిదశలో ఎదిగే భాగాల్లో భాస్వరం అందుబాటులో ఉండటం చాలా అవసరం.
- ఆమ్ల, క్షార భూముల్లో భాస్వరం సరిగ్గా అందుబాటులో ఉండదు.
- సాగు నేలల్లో భాస్వరం అధికమైన జింకు లోపం వస్తోంది.

జీవ ఎరువులతో ఉపయోగాలు:

జీవన ఎరువుల్లో బాసిల్లాస్, సూడోమోనాస్ వంటి సూక్ష్మజీవులు ఆస్పర్జిల్లస్, పెన్సిలియం వంటి శిలీంద్రాలు భూమిలో కరగని రూపంలో భాస్వరాన్ని కరిగించి మొక్కకు లభ్యత పెంచుతాయి. సిఫార్సు చేసిన భాస్వర మోతాదును ఎకరాకు 10 నుంచి 12 కిలోల వరకూ తగ్గించుకోవచ్చు. పచ్చి రొట్టె ఎరువుల వాడకం వల్ల భూమికి సేంద్రియ పదార్థాన్ని అందిస్తాయి. సూక్ష్మజీవుల సంతతి వృద్ధి చెందుతాయి. విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తుంది. మట్టి నమూనాల్లో భాస్వరం విలువ 20 కంటే తక్కువ గల భూములను 21 నుంచి 50 వరకు మధ్య భూములుగా పరిగణించబడతాయి.

కరగని రూపంలో భాస్వరం..

సాగవుతున్న భూముల్లో 60 శాతం కంటే ఎక్కువగా ఉన్న భాస్వరం పోషకం కరగని డై కాల్షియం, ట్రై కాల్షియం ఫాస్ఫేట్‌ల రూపంలో ఉంది. తేలికే భూముల్లో కంటే బరువు నేల(వరి పండించే డెల్టా భూములు)ల్లో భాస్వరం పోషకం ఎక్కువ శాతం మొక్కలకు అందుబాటులో లేని రూపంలో ఇమిడీకృతమై దాగి ఉంది. ఈ నేలల్లో భాస్వరం వినియోగ సామర్థ్యం తక్కువేనని చెప్పవచ్చు రైతులు వాడే భాస్వరపు ఎరువుల్లోని భాస్వర పోషకం మోనో కాల్షియం ఫాస్పెట్ రూపంలో ఉంటుంది. ఇది పూర్తిగా నీటిలో కరుగుతుంది. కరిగిన వెంటనే నేలలోని అల్యూమినియం, ఐరన్ ఆక్సైడ్‌లతోను కాల్షియం, మెగ్నీషియం కార్బోనేట్లతోను రసాయన చర్య జరుగుతుంది. దీని ఫలితంగా అల్యూమినియం ఫాస్ఫేట్, మెగ్నిషియం ఫాస్ఫేట్లుగా మారుతాయి. ఇవి కరగని రూపంలో ఉండి తర్వాత భూమిలోని సూక్ష్మజీవుల చర్యల వల్ల మొక్కకు అందుబాటులోకి వస్తాయి.

కూష్మాండాదేవిగా జోగుళాంబ

- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- ఆదివారం పెరిగిన భక్తుల తాకిడి



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న కర్నూలు కలెక్టర్ రంజిత్‌బాషా దంపతులు



చిన్నారికి ప్రశంస పత్రం ఇస్తున్న ఈవో

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం 4వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అమ్మవారిని నవదుర్గల్లో నాలుగో అవతారమైన కూష్మాండాదేవిగా అలంకరించి ఆరాధించారు. ఈ అమ్మవారు సృష్టికంతా తానై ఉంటుందని.. అమ్మలగన్న అమ్మను ఆరాధించడంతో సకల శుభాలు కలుగుతాయని అర్చకులు వివరించారు. ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు అధికసంఖ్యలో ఆలయాలను దర్శించుకున్నారు.

చండీహోమాలు..

నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో చండీహోమాలు, రుద్రహోమాలు నిర్వహించారు. దర్బార్‌సేవలో భాగంగా అమ్మవారికి సువాసిని, కుమారి పూజలు చేశారు.

ఆలయాలను దర్శించుకున్న ప్రముఖులు..

ఆలయాలను ఆదివారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యార్ దర్శించుకొని ప్రత్యేక చండీహోమాలు చేశారు. అలాగే ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయుడు, మేఘారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, నేషనల్‌బోర్డ్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి రవీందర్ దర్శించుకున్నారు.

- నృత్య ప్రదర్శనలు.. వరంగల్ భద్రకాళి కూచిపుడి కళాక్షేత్రం, సాయి నటరాజ డ్యాన్స్ అకాడమీ పెంబర్తి చిన్నారులు ఆలయంలో కూచిపూడి, భరతనాట్యం చేశారు. వీరికి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

చెదురు మదురు ఘటనలు..

మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబం పూజల్లో ఉండగా వారి కుమార్తె సొమ్మసిల్లి పడిపోయింది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఈఓ పురేందర్‌కుమార్ వైద్యులను పిలిపించి చికిత్స అందించారు. అలాగే ఎంపీ మల్లు రవితో పాటు ఆలయానికి వచ్చిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ భర్త తిరుపతయ్య పూజల అనంతరం వేదాశీర్వచన మండపం దగ్గర ఫిట్స్ రావడంతో వెంటనే కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారని ధరూర్ మండలానికి చెందిన ఓ మహిళ అలంపూర్‌లో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న భక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఆస్పత్రికి పంపించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన కర్నూల్ కలెక్టర్

జోగుళాంబ అమ్మవారికి ఆదివారం ఏపీ ప్రభుత్వం తరపున కర్నూలు కలెక్టర్ పి.రంజిత్‌బాషా దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి ఆలయంలో అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అర్చన అనంతరం ఈఓ శేషవస్త్రాలతో సత్కరించారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జూరాలకు స్వల్పంగా పెరిగిన వరద

ధరూరు/ దోమలపెంట/ ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు అధికారులు తెలిపారు. శనివారం రాత్రి 55,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఆదివారం 61,000 క్యూసెక్కులకు పెరిగినట్లు చెప్పారు. దీంతో ప్రాజెక్టు వద్ద 3 క్రస్టు గేట్లను ఎత్తి 21,630 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి నిమిత్తం 37,252, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 730, సమాంతర కాల్వకు 300, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు వదలగా.. మరో 96 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.439 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



జూరాల క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

శ్రీశైలానికి నిలకడగా వరద

శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వరద నిలకడగా కొనసాగుతుంది. జూరాలలో ఆనకట్ట గేట్ల ద్వారా 21,603, విద్యుదుత్పత్తి చేస్తూ 37,252, సుంకేసుల నుంచి 26,874 కలిపి మొత్తం 85,756 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తుంది. దీంతో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 14,379 మొత్తం 49,694 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 10,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,520, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 881.9 అడుగుల వద్ద 198.3623 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

వేగవంతంగా విద్యుదుత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఆదివారం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు ఉత్పత్తి చేశారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటివరకు 451.375 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని వివరించారు.

అనుమతి లేకుండా బ్లాస్టింగ్ నిర్వహిస్తే చర్యలు



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

ఊర్కొండ: గుట్టల్లో రాతి కడీల కోసం అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ నాగార్జున హెచ్చరించారు. ఊర్కొండపేట శివారులోని హనుమాన్ గుట్టలో రాతి కడీల తొలగింపు కోసం అక్రమంగా బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తుండగా.. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్ఐ వీరబాబు, పోలీసు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. బ్లాస్టింగ్ కోసం వినియోగిస్తున్న రెండు కంప్రెషర్లు, ఒక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, రాతి కడీల అక్రమ తొలగింపు, బ్లాస్టింగ్‌లకు సంబంధించి కేసులు కాకుండా అధికార పార్టీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని డబ్బు సంపాదించుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని విమర్శిస్తున్నారు. గతనెలలో స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గుట్టల్లో అక్రమ బ్లాస్టింగ్‌ల విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. గుట్టల్లో అక్రమంగా బ్లాస్టింగ్‌లు నిర్వహించి, రాతి కడీలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. స్థానిక నాయకులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం తగదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న విరాహత్‌అలీ

అచ్చంపేట రూరల్: జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని.. వారి భవిష్యత్‌కు భరోసాగా నిలుస్తామని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ అన్నారు. ఆదివారం అచ్చంపేటలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విరాహత్‌అలీ మాట్లాడుతూ... రాష్ట్రంలో జర్నలిస్టుల వైద్యం, పిల్లల విద్య, ఇతర సమస్యలపై ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమస్యల సాధనం కోసం కేబినెట్‌లో జీఓ తీసుకొచ్చే విధంగా యూనియన్ పని చేస్తుందన్నారు. 60 ఏళ్లుగా జర్నలిస్టుల పక్షాన పోరాడుతున్న ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజేనన్నారు. గత ప్రభుత్వంలో 6వేల అక్రిడిటేషన్ కార్డులను అనర్హులకు అమ్ముకున్నారని ఆరోపించారు. త్వరలోనే రాష్ట్రంలోని జర్నలిస్టులతో హైదరాబాదులో సభ నిర్వహిస్తామన్నారు. జర్నలిస్టుల హెల్త్‌కార్డులపై మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టిసారించారని వివరించారు. రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ మాట్లాడుతూ అనారోగ్యంతో మృతి చెందిన లింగాల రిపోర్టర్ రఘుపతిరాథోడ్ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. అనంతరం అచ్చంపేట నియోజకవర్గం నుండి టీయూడబ్ల్యూజే(143) నుండి భారీగా ఐజేయూలో చేరారు. కోశాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములునాయక్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శంకర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు కర్ణయ్య, శ్యాంసుందర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరావు, రాజు పాల్గొన్నారు.